క్లుప్తంగా

చెత్త శుద్ధి కేంద్రాల తనిఖీ



గ్రీన్ అంబాసిడర్లతో మాట్లాడుతున్న ఈఓఆర్డీ

కొమరోలు: మండలంలోని పలు గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను మండల విస్తరణాధికారి బ్రహ్మయ్య గురువారం తనిఖీ చేశారు. అల్లినగరం, బ్రాహ్మణపల్లె గ్రామ పంచాయతీల్లో కేంద్రాలను పరిశీలించి గ్రీన్ అంబాసిడర్లతో మాట్లాడారు. షెడ్ల మరమ్మతులు, ఇతర వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. తడిచెత్త, పొడి చెత్తను ప్రాసెసింగ్ చేసే విధానంపై గ్రీన్ అంబాసిడర్లకు అవగాహన కల్పించారు.

75 శునకాలకు వ్యాక్సినేషన్



కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల కాలంలో కుక్కకాటు కేసులు పెరుగుతుండటంతో ఇప్పటి వరకు 75 కుక్కలను పట్టుకుని వ్యాక్సిన్ వేయించినట్లు కమిషనర్ నారాయణరావు తెలిపారు. గురువారం బృందావనం కాలనీలో 4, మాగుంట సుబ్బరామిరెడ్డి పార్కు వద్ద 2, కొండారెడ్డి కాలనీలో 4, పూలసుబ్బయ్య కాలనీలో 6, బాపూజీ కాలనీలో 5, పవర్ ఆఫీసు వద్ద 4 కుక్కలను పట్టుకుని వ్యాక్సినేషన్ పూర్తి చేసినట్లు వివరించారు.

ఏపీలోనూ ఎస్సీ వర్గీకరణ అంశాన్ని ఆమోదించాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కంభం: ఎస్సీ వర్గీకరణకు తెలంగాణ ప్రభుత్వం మాదిరిగానే ఆంధ్రప్రదేశ్‌లోనూ ఆమోదం తెలపాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పానుగంటి షాలెంరాజు, నేదరపల్లి జయరాజ్ కోరారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రంజాన్ మిశ్రా కమిషన్ నివేదికను పరిశీలించి ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలను యూనిట్‌గా కాకుండా జస్టిస్ రామచంద్ర రాజు కమిషన్ నివేదిక ఆధారంగా రాష్ట్ర యూనిట్‌గానే వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలన్నారు. సమావేశంలో రమేష్ రాజు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ, ఎస్సై

మార్కాపురం:

క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని మార్కాపురం సీఐ సుబ్బారావు క్రీడాకారులకు సూచించారు. గురువారం పట్టణ శివార్లలోని ఎస్‌వీకేపీ కళాశాల మైదానంలో ఎస్ఎస్ఎన్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. క్రీడలు ఐక్యతను పెంచుతాయన్నారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.30,116, రెండో బహుమతి రూ.20,116, మూడో బహుమతి రూ.10,116తోపాటు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సీరిస్ బహుమతులు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై సైదుబాబు, టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఒకటే కంపు.. కలగదా కనువిప్పు?



చెత్తా చెదారంతో నిండిన చెరువు కట్ట



మురుగుతో నిండిన సప్లయ్ చానల్

- మార్కాపురం చెరువు అభివృద్ధిపై నవ మాసాలుగా నాన్చుడే!
- చెరువులో నీళ్లున్నా సాగుకు విడుదల చేయలేని పరిస్థితి
- 2 కి.మీ మేర వ్యర్థాలతో నిండిన సప్లయ్ చానల్
- దుర్వాసన భరించలేకపోతున్నామని 300 కుటుంబాల ఆవేదన
- నిర్వహణను గాలికొదిలేసిన నీటిపారుదల శాఖ అధికారులు

మార్కాపురం: కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు కావస్తున్నా చెరువుల నిర్వహణను గాలికొదిలేయడంతో నిరుపయోగంగా మారాయి. అది చేస్తాం.. ఇది చేస్తాం అని చెప్పిన నాయకులు, అధికారంలోకి వచ్చిన తర్వాత ఏదీ చేయకుండా చోద్యం చూస్తుండటంతో అందరికీ అవస్థలు మొదలయ్యాయి. శతాబ్దాల చరిత్ర కలిగిన మార్కాపురం చెరువు, సప్లయ్ చానల్ నిర్వహణను నీటిపారుల శాఖ అధికారులు గాలికొదిలేశారు. దీంతో మార్కాపురం చెరువులో నీళ్లున్నా ప్రయోజనం లేకుండా పోయింది. మార్కాపురం చెరువు సప్లయ్ చానల్ కాలుష్య కాసారంగా మారిపోయింది.కాలువ చెత్తా చెదారంతో నిండిపోయి కంపుకొడుతుండటంతో ఇరువైపులా ఉన్న వందలాది కుటుంబాల వారు ఇబ్బంది పడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సప్లయ్ చానల్‌కు మరమ్మతులు చేయించి కాలువ చుట్టూ ఫెన్సింగ్ వేయించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చెరువు, సప్లయ్ చానల్ అభివృద్ధిపై ప్రతిపాదనలతోనే 9 నెలల కాలం గడిచిపోయింది. కాలువల్లో ఎక్కడి మురుగు అక్కడే చేరిపోవడంతో కట్టకు రెండు వైపులా ఉన్న సుమారు 300 కుటుంబాల ప్రజలు మురుగు వాసన భరించలేక ముక్కు మూసుకుని ఉండాల్సి వస్తోంది. సప్లయ్ చానల్‌లో సుమారు 2 కిలోమీటర్ల మేర వివిధ రకాల వ్యర్థాలు పేరుకుపోయాయి. మొత్తం మీద 600 ఎకరాల విస్తీర్ణం కలిగిన మార్కాపురం చెరువు దయనీయ పరిస్థితిలో ఉంది. ఈ చెరువు కింద అధికారికంగా 1000 ఎకరాలు, అనధికారికంగా మరో 300 ఎకరాలు సాగవుతుంది. కాలువలకు మరమ్మతులు చేయకపోవడంతో చెరువులో నీళ్లున్నా ఉపయోగం లేకుండా పోయింది. మార్కాపురం మండలం మాల్యవంతునిపాడు వద్ద నుంచి సప్లయ్ చానల్ ప్రారంభమవుతుంది. కొండేపల్లి, రామచంద్రాపురం గ్రామాల మీదుగా ఏబీఎం కాంపౌండ్, సబ్‌కలెక్టర్ కార్యాలయం పక్క నుంచి కాలువ వెళ్తుంది.

అభివృద్ధికి చర్యలేవి?

శ్రీకృష్ణదేవరాయలు కాలంలో నిర్మించిన చెరువు ప్రస్తుతం 5 అడుగుల మేర పూడికతో నిండిపోయి పల్లెంలా తయారైంది. కొద్దిపాటి వర్షానికే చెరువు నిండినట్టుగా కనిపిస్తోంది. పట్టణంలోని చెత్తాచెదారమంతా చెరువుతోపాటు చెరువు కట్టపై వేస్తున్నారు. ఈ పరిణామంతో సుందరంగా ఉండాల్సిన చెరువు కంపు కొడుతోంది. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు ద్వారా రూ.12 కోట్ల నిధులను చెరువుకట్ట అభివృద్ధికి కేటాయించింది. అయితే గతేడాది ఎన్నికల హడావుడి కారణంగా పనులు ప్రారంభం కాలేదు. చెరువుకట్టపై సుమారు 10 లక్షల రూపాయలతో మొదటి సారిగా వీధిలైట్లు ఏర్పాటు చేయించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ నిధుల వినియోగంపై దృష్టి సారించలేదు.

దుర్వాసన భరించలేకపోతున్నాం



శతాబ్దాల చరిత్ర కలిగిన చెరువు కాలువ కంపు కొడుతోంది. భరించలేకుండా ఉన్నాం. కొండేపల్లి రోడ్డు నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం, అలుగు వరకు కాలువకు రెండు వైపులా వందలాది గృహాలు ఉన్నాయి. అధికారులు మురుగు తొలగించేందుకు చర్యలు చేపట్టాలి.

– ఇమ్రాన్, మార్కాపురం

ప్రతిపాదనలు పంపాం

మార్కాపురం చెరువు అభివృద్ధికి రూ.18 కోట్లతో, సప్లయ్ చానల్ అభివృద్ధికి మరో రూ.40 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే చెరువును బాగుచేస్తాం.

– **పాల్‌రాజ్**, జలవనరుల శాఖ డీఈ, మార్కాపురం

సంక్షేమానికి కూటమి ముల్లు

చిల్ల చెట్ల మధ్య 12 రేషన్ పంపిణీ వాహనాలు ● ప్రారంభానికి నోచుకోని ప్రభుత్వ భవనాలు



పాములపల్లె రోడ్డులో చిల్లచెట్ల మధ్య ఉండిపోయిన వాహనం

గిద్దలూరు రూరల్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమానికి పెద్ద పీట వేసి పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించింది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని గాలికొదిలేసి, పేదలను మరింత క్షోభకు గురిచేస్తోంది. పేద ప్రజలకు ఇంటి వద్దకే రేషన్ బియ్యం పంపిణీ చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఎండీయూ వాహనాల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిపోయింది. గిద్దలూరు రూరల్ మండల పరిధిలో 10, అర్బన్ పరిధిలో 5 ఎండీయూ వాహనాలు ఉండగా ప్రస్తుతం వాటిలో మూడు మాత్రమే తిరుగుతున్నాయి. మిగిలిన 12 వాహనాలను చిల్లచెట్ల మధ్య పడేయడంతో రేషన్ పంపిణీ వ్యవస్థ దారుణంగా తయారైంది. ఆ మూడు వాహనాలు కొన్ని ప్రదేశాలకే వెళ్తుండగా, మిగిలిన వారు సంచులు చేతపట్టి దుకాణాల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఈ క్రమంలో పనులకు వెళ్లే పేదలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

మండలంలోని వెల్లుపల్లె గ్రామంలో రైతు భరోసా కేంద్రం నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. ఆ భవనానికి గత ఏడు నెలలుగా విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా పాలకులు చోద్యం చూస్తున్నారు. ఇదే గ్రామంలో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం కూడా నిరుపయోగంగా ఉండిపోయింది. స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి రాక కోసం భవనాల ప్రారంభోత్సవాన్ని ఎప్పటికప్పుడు అధికారులు వాయిదా వేస్తూ వస్తున్నారు. దీంతో ఆ భవనాల చుట్టూ చిల్ల చెట్లు ఏపుగా పెరిగాయి. భవనాలు ప్రారంభించకముందే శిథిలావస్థకు చేరుకునేలా ఉన్నాయని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు స్పందించి నిరుపయోగంగా ఉన్న రేషన్ పంపిణీ వాహనాలను ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. అలాగే రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల చుట్టూ చిల్లచెట్లను తొలగించి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.





వెల్లుపల్లెలో ప్రారంభానికి నోచుకోని రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య ఉప కేంద్రం

ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా పొలాల్లో మొక్కలా?

- అటవీశాఖ అధికారులతో ఇబ్బంది పడుతున్నాం
- ఫారెస్ట్ ఫీల్డ్ డైరెక్టర్‌కు ముంపు గ్రామాల ప్రజల వినతి



అటవీ శాఖ ఫీల్డ్ డైరెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న వెంకటరామిరెడ్డి

మార్కాపురం: పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న గ్రామాల ప్రజలు అటవీశాఖ అధికారుల తీరుతో ఇబ్బంది పడుతున్నారని, వారికి న్యాయం చేయాలని అటవీ శాఖ ఫీల్డ్ డైరెక్టర్ కృష్ణమూర్తిని 'వెలుగొండ' నిర్వాసితుల సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి కోరారు. ఈ మేరకు బాధితులతో కలిసి గురువారం నంద్యాలలో ఫీల్డ్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్దారవీడు మండలంలోని గుండంచర్ల గ్రామానికి చెందిన కొంతమంది రైతుల పొలాల్లో అటవీ అధికారులు ఉన్నతాధికారుల అనుమతి తీసుకోకుండా చెట్లు నాటారని వివరించారు. వాస్తవానికి ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చినట్లయితే గుండంచర్ల గ్రామస్తులు తమ స్వగ్రామం నుంచి బయటకు వస్తారని, కానీ ప్యాకేజీ ఇవ్వకపోవడంతో వారు అక్కడే ఉంటూ తమ పొలాలు సాగు చేసుకుంటున్నారని తెలియజేశారు. ఈ విషయం తెలిసి కూడా అటవీశాఖ అధికారులు పేదల భూముల్లో చెట్లునాటి ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. ఇదే విషయాన్ని ప్రకాశం జిల్లా ఉన్నతాధికారులు, వెలుగొండ ప్రాజెక్టు అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అటవీశాఖ అధికారులు మొక్కలు నాటడం వల్ల ఎస్సీ, ఎస్టీ రైతులు తమ పొలాలను సాగుచేసుకోలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ముంపు గ్రామాల రైతులకు న్యాయం చేయాలని కోరారు.

రూ.లక్షలు వెచ్చించి..నిరుపయోగంగా వదిలేసి!

- నిర్మించి ఏడాదైనా ప్రారంభానికి నోచుకోని పబ్లిక్ టాయిలెట్స్



ప్రారంభించకుండా వదిలేసిన పబ్లిక్ టాయిలెట్స్

కంభం: లక్షలాది రుపాయలు వెచ్చించి నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్ సంవత్సర నుంచి ప్రారంభించకుండా వదిలేయడంపై తీవ్రంగా విమర్శలు వస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే కందులాపురం కూడలి పరిసరాల్లో పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు అధికంగా ఉన్నాయి. హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ నుంచి బస్సుల్లో వచ్చే ప్రయాణికులు తెల్లవారు జామున ఈ ప్రాంతంలోనే బస్సులు దిగితుంటారు. రైళ్లలో దూరప్రాంతాల నుంచి ప్రయాణాలు చేసి వచ్చిన ప్రయాణికులు ఆటోలో కందులాపురం కూడలికి చేరుకొని వారి ఊర్లకు బస్సుల్లో వెళ్తుంటారు. ఇలాంటి ప్రాంతంలో మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు, ప్రయాణికులు, విద్యార్థినీ, విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కందులాపురం–2 సచివాలయం పక్కనే పబ్లిక్ టాయిలెట్స్ ఏడాది క్రితం నిర్మించారు. అప్పట్లో ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ప్రారంభానికి నోచుకోలేదు. ఎన్నికల కోడ్ ముగిసి 9 నెలలు కావస్తున్నా నేటికీ పబ్లిక్ టాయిలెట్స్‌ను అధికారులు ప్రారంభించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే పబ్లిక్ టాయిలెట్స్‌ను ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి రుణాలు

- లీడ్ బ్యాంక్ మేనేజర్ రమేష్



మాట్లాడుతున్న రమేష్

మార్కాపురం: మహిళల ఆర్థికాభివృద్ధికి బ్యాంకులు సహకరిస్తాయని లీడ్ బ్యాంకుమేనేజర్ డి రమేష్ అన్నారు. గురువారం మార్కాపురం వెలుగు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉమెన్ ఎంటర్‌ప్రైజెస్ కింద ప్రతి కుటుంబంలో ఒక మహిళను వ్యాపారవేత్తగా, పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దేందుకు సహకరిస్తామన్నారు. బ్యాంకు మేనేజర్ కూడా తమ టార్గెట్‌ను పూర్తిచేయాలన్నారు. వెలుగు బ్యాంకు లింకేజీ విభాగం జిల్లా మేనేజర్ సునీత మాట్లాడుతూ మహిళలకు బ్యాంకర్లు సహకరించి రుణాలు ఇవ్వాలని కోరారు. మహిళల జీవనోపాధుల అభివృద్ధికి సహకరించాలన్నారు. నూరు శాతం రుణాలను రికవరీ చేయాలని సూచించారు. మార్కాపురం ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ఎన్.హరి, కెనరా బ్యాంకు చీఫ్ మేనేజర్ బాలక్రమ్ మాఘీ, యర్రగొండపాలెం ఏరియా కోఆర్డినేటర్ దానం, మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు, దోర్నాల మండలాల ఏపీఎంలు పిచ్చయ్య, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ గోడౌన్ తనిఖీ



గ్యాస్ గోడౌన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

గిద్దలూరు రూరల్: పట్టణ పరిధిలోని చట్టిరెడ్డిపల్లె సమీపంలో, నరవ రోడ్డులో ఉన్న గ్యాస్ గోడౌన్లను తహశీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి గురువారం తనిఖీ చేశారు. సిలిండర్లను నిల్వ ఉంచే ప్రదేశంలో తీసుకుంటున్న జాగ్రత్తలను పరిశీలించారు. స్టాక్ రికార్డులు తనిఖీ చేసి సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. వినియోగదారులకు అధిక ధరకు గ్యాస్ విక్రయించడం విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. ఆయన వెంట ఎలక్షన్ డీటీ రామనారాయణరెడ్డి, ఆర్‌ఐ భాస్కర్‌రావు, సిబ్బంది ఉన్నారు.

క్యాన్సర్ బాధితుల గుర్తింపునకు స్క్రీనింగ్



ఏలూరులో ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

పొదిలి రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఎన్‌సీడీ(నాన్ కమ్యూనికబుల్ డిసీజ్) సర్వే నిర్వహిస్తున్నట్లు ఉప్పలపాడు పీహెచ్‌సీ డాక్టర్ ఎం.సుగుణకుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. క్యాన్సర్ బారిన పడిన వ్యాధిగ్రస్తులను కనుగొనడం సర్వే ముఖ్య ఉద్దేశమన్నారు. ముందుగానే వ్యాధిగ్రస్తులను గుర్తిస్తే క్యాన్సర్ ఏ దశలో ఉందో తెలుసుకుని చికిత్స పొందే అవకాశం ఉంటుందన్నారు. సర్వేలో భాగంగా క్యాన్సర్, సుగర్, బీపీ పరీక్షలు కూడా చేస్తున్నట్లు చెప్పారు. మండలంలో 49,318 మందిని సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 16600 మందిని స్క్రీనింగ్ చేసినట్లు చెప్పారు. సర్వేలో డాక్టర్ టి.సుష్మ, సిబ్బంది ఎల్.శ్రీనివాస రెడ్డి, జిలానీ, ఆదిలక్ష్మి, శ్రీధర్, బాజీ, అవినాష్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిందితుల అరెస్టు

యర్రగొండపాలెం: స్థానిక అవంతి మెడికల్స్ యజమానిపై దాడి చేసిన సంఘటనలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై పి.చౌడయ్య గురువారం తెలిపారు. ఈ నెల 3వ తేదీన కృష్ణనాయక్, సి.బాబు అనే వ్యక్తులు మందులు కొనుగోలు చేశారు. అందుకు సంబంధించిన బిల్లు పే చేయమని ఆ మెడికల్స్ యజమాని మల్లికార్జున్ అడిగాడని, తాము డబ్బులు ఇచ్చేది ఏందని నిందితులు అతనిపై దాడి చేశారని తెలిపారు. మల్లికార్జున్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మృతురాలికి మాజీ ఎమ్మెల్యే అన్నా నివాళి



మృతదేహానికి నివాళులర్పిస్తున్న అన్నా రాంబాబు

పొదిలి రూరల్: మండలంలోని కంభాలపాడుకు చెందిన బసిరెడ్డి సుబ్బరత్తమ్మ విద్యుదాఘాతంతో బుధవారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె మృతదేహానికి గురువారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా వెంకట రాంబాబు గురువారం సాయంత్రం నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

నేటితో ముగియనున్న రుణ దరఖాస్తు గడువు

బేస్తవారిపేట: స్వయం ఉపాధి కోసం రుణాలు పొందేందుకు బీసీ, ఈబీసీలు శుక్రవారం సాయంత్రంలోగా ఏపీ ఏబీఎంఎస్ఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు సూచించారు. కుటుంబ ఆదాయం పట్టణ ప్రాంతాల్లో రూ.1,03,000, గ్రామీణ ప్రాంతాల్లో రూ.81 వేలు ఉండి, 21 నుంచి 60 మధ్య వయసున్న వారు అర్హులని స్పష్టం చేశారు. కుల ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, ఆధార్ కార్డును దరఖాస్తుకు జత చేయాలని సూచించారు.

హనుమంత వాహనంపై శ్రీవారి దర్శనం



హనుమంత వాహనంపై శ్రీవారు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివార్లలోని జంకె రామిరెడ్డి నగర్‌లో శ్రీలక్ష్మీ పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి 18వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు ఉభయదేవేరులతో కలిసి హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి, ఉత్సవ మూర్తులకు పంచామృత స్నపన కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చక్కా మాలకొండ నరసింహారావు, ఊటుకూరి రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు ఆర్‌కేజే నరసింహం, కోశాధికారి పీవీ శ్రీనివాసులు, ఏరువ దేవిరెడ్డి, గోగురామయ్య తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జంకె తదితరులు